# పోలింగ్ నేడే..



అంబేద్కర్ స్టేడియంలో ఈవీఎంల వివరాల నమోదు చేసుకుంటున్న ఎన్నికల సిబ్బంది

- భూపాలపల్లి నియోజకవర్గంలో 317 పోలింగ్ కేంద్రాలు
- 2,73,633 మంది ఓటర్లు
- 29 సెక్టార్లు.. 29 రూట్లు.. 101 బస్సుల ఏర్పాటు..
- 1,732 మంది పోలింగ్ సిబ్బంది
- మహిళా, దివ్యాంగులకు ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రాలు
- పూర్తయిన పోస్టల్ బ్యాలెట్ ఎన్నికలు
- ఎస్పీ ఆధ్వర్యంలో పోలీసుల బందోబస్తు

జయశంకర్ భూపాలపల్లి, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ) : భూపాలపల్లి నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. జిల్లా ఎన్నికల అధికారి భవేశ్‌మిశ్రా పోలింగ్ ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. నియోజకవర్గంలో 2,73,633 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో మహిళలు 1,37,743, పురుషులు 1,35,884, ఇతరులు ఆరుగురు ఉన్నారు. భూపాలపల్లి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు, సెక్టార్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్లతో పోలింగ్ సిబ్బంది నియామకం పూర్తయింది. భూపాలపల్లి నియోజకవర్గంలో 317 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి 1,732 పోలింగ్ సిబ్బందిని కేటాయించారు. మొత్తం 317 పోలింగ్ కేంద్రాలకు 29 సెక్టార్లు, 29 రూట్లుగా విభజించి 29 మంది రూట్ ఆఫీసర్లు, 29 మంది సెక్టార్ ఆఫీసర్లను నియమించారు. పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు, ఎన్నికల సామగ్రి, పోలింగ్ సిబ్బందిని తీసుకెళ్లేందుకు 101 బస్సులను ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో ప్రత్యేకంగా మహిళా, దివ్యాంగుల, యూత్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు ఎస్పీ కిరణ్ ప్రభాకర్ ఖరె ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

**పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక వసతులు**

భూపాలపల్లి నియోజకవర్గంలో 317 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసిన అధికారులు పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించారు. పోలింగ్ కేంద్రాల్లో కరెంటు, తాగునీరు, టాయిలెట్లు, ర్యాంప్‌లు తదితర సౌకర్యాలు కల్పించారు. నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రం నెంబర్ 27(పవిత్ర కళాశాల భూపాలపల్లి), 146 (గణపురం హైస్కూల్), 166 (చిట్యాల హైస్కూల్), 192 (మొగుళ్లపల్లి హైస్కూల్), 223 (రేగొండ హైస్కూల్) పోలింగ్ కేంద్రాలను మహిళలకు కేటాయించారు. అలాగే భూపాలపల్లిలోని పోలింగ్ స్టేషన్ నెంబర్ 38 (మైన్స్ రెస్క్యూ రూం)ను దివ్యాంగులకు కేటాయించారు. అలాగే పోలింగ్ స్టేషన్ 30 (మైన్స్ రెస్క్యూ రూం, భూపాలపల్లి), 110 (జడల్‌పేట ఎంపీఎస్), 141 (గణపురం హైస్కూల్), 195 (మొగుళ్లపల్లి హైస్కూల్), 225 (రేగొండ హైస్కూల్) పోలింగ్ స్టేషన్లను మోడల్ పోలింగ్ స్టేషన్లుగా ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా భూపాలపల్లిలోని 46వ పోలింగ్ స్టేషన్ (ప్రభుత్వ జూనియర్ కళాశాల)ను యూత్ పోలింగ్ స్టేషన్‌గా ఏర్పాటు చేశారు.

**2,73,633 మంది ఓటర్లు**

భూపాలపల్లి నియోజకవర్గంలో మొత్తం 2,73,633 మంది ఓటర్లు ఉన్నారు. భూపాలపల్లి మండలంలో 77,077 మంది, చిట్యాల మండలంలో 30,329, గణపురంలో 31,909, మొగుళ్లపల్లిలో 29,854, రేగొండలో 49,290, శాయంపేటలో 33,459, టేకుమట్ల మండలంలో 21,715 మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం ఓటర్లలో ట్రాన్స్‌జెండర్లు ఆరుగురు, సర్వీసు ఓటర్లు 170, ఎన్ఆర్ఐ ఓటర్లు ఎనిమిది మంది ఉన్నారు. 80ఏళ్లు దాటిన వృద్ధులు 12డీ ఫాం ద్వారా ఓటు కోసం 137 మంది దరఖాస్తు చేసుకోగా ఇప్పటి వరకు 125 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే ఇప్పటి వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా 2,095 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సారి 170 మంది డిఫెన్స్ ఉద్యోగులకు ఓటు హక్కు కల్పించారు.

**సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి**

నియోజకవర్గంలో సమస్యాత్మక కేంద్రాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. 93 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా, 17 పోలింగ్ కేంద్రాలను మావోయిస్టు ప్రభావిత పోలింగ్ కేంద్రాలుగా గుర్తించి ఎస్పీ కిరణ్ ఖరె ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. 205 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్‌ను, 105 పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలతో ప్రత్యేక పర్యవేక్షణను ఏర్పాటు చేశారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు నియోజకవర్గంలో వెయ్యి మంది పోలీసు సిబ్బందిని నియమించారు. 10 మంది సీఐలు, నలుగురు డీఎస్పీలు, 20 మంది ఎస్సైలతో పాటు నాలుగు కంపెనీల సీఆర్పీఎఫ్ బలగాలు, ఛత్తీస్‌గఢ్ నుంచి 200 మంది హోంగార్డులు ఎన్నికల్లో విధులు నిర్వహిస్తున్నారు.

**నేడే పోలింగ్**

నియోజకవర్గంలోని 317 పోలింగ్ కేంద్రాల్లో నేడు 2,73,633 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. 712 బ్యాలెట్ యూనిట్లు, 396 కంట్రోల్ యూనిట్లు, 443 వీవీ ప్యాట్లను వినియోగించనున్నారు. పోలింగ్ సందర్భంగా బుధవారం భూపాలపల్లిలోని అంబేద్కర్ స్టేడియంలో పోలింగ్ సామగ్రి, ఈవీఎంలు, వీవీ ప్యాట్ల పంపిణీకి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పీవోలు, ఏపీవోలు, ఓపీవోలు, సెక్టార్ అధికారులు, రూట్ అధికారులు, ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం వద్దకు చేరుకుని ఆయా పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లారు. 317 పోలింగ్ కేంద్రాలకు 101 బస్సులను ఏర్పాటు చేశారు. జిల్లా ఎన్నికల అధికారి భవేశ్‌మిశ్రా, అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో రమాదేవి, సిబ్బందికి విధులు కేటాయిస్తూ పోలింగ్ సామగ్రిని అందజేశారు. డీఎస్పీ రాములు బందోబస్తును పర్యవేక్షిస్తూ పోలీసు అధికారులు, సిబ్బందిని పోలీసు కేంద్రాలకు అలాట్ చేశారు.



అంబేద్కర్ స్టేడియం నుంచి పోలింగ్ సామగ్రిని తీసువెళ్తున్న అధికారులు



# ఎన్నికలకు సర్వం సిద్ధం

- నియోజకవర్గంలో 2,26,366 ఓటర్లు
- 303 పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు
- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లు
- ఓటర్లకు అన్ని ఏర్పాట్లు పూర్తి
- జిల్లా ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి
- పంపిణీ కేంద్రాన్ని పరిశీలించిన ఎన్నికల పరిశీలకుడు రత్నాకర్ ఝూ



ములుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఎన్నికల సామగ్రిని సరి చూసుకుంటున్న అధికారులు

ములుగు రూరల్, నవంబర్ 29 : ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నేడు జరగబోయే పోలింగ్ కోసం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని ఆమె ఎన్నికల పరిశీలకుడు రత్నాకర్ ఝూతో కలిసి పరిశీలించారు. అనంతరం రిటర్నింగ్ అధికారి అంకిత్‌తో కలిసి సిబ్బందికి పోలింగ్ సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ములుగు నియోజకవర్గ పరిధిలో 2,26,366 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు 303 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. పంపిణీ కేంద్రాల్లో పోలింగ్ సామగ్రి పంపిణీ చేసేటప్పుడు, ఎన్నికల అనంతరం సామగ్రిని తిరిగి భద్రపర్చే సమయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటర్ల కోసం తగిన ఏర్పాట్లు చేశామని, ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు అవసరమైన తాగునీరు, టాయిలెట్, ఇతర వసతులను కల్పించామని తెలిపారు. దివ్యాంగుల కోసం పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన ర్యాంపులు, ట్రై సైకిళ్లు సిద్ధం చేశామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాట్లను చేసి అదనపు బలగాలను మోహరించామని తెలిపారు. అధిక శాతం పోలింగ్ నమోదయ్యేలా ఓటు హక్కు ప్రాముఖ్యతపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. నియోజకవర్గంలో అత్యధిక పోలింగ్ శాతం నమోదవుతుందని కలెక్టర్ ధీమా వ్యక్తం చేశారు. ఓటు వారి భవిష్యత్తును నిర్దేశిస్తుందని, ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ప్రజలు ఆలోచించి స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. పోలింగ్ సామగ్రి పంపిణీలో అదనపు కలెక్టర్ డీ వేణుగోపాల్, డిప్యూటీ స్పెషల్ కలెక్టర్ డీఎస్ వెంకన్న, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, ఏఆర్వో విజయ్‌భాస్కర్, సంబంధిత అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.







పోలింగ్ కేంద్రానికి బయలుదేరుతున్న ఎన్నికల సిబ్బంది

# వెబ్ కాస్టింగ్ పరిశీలన

- ఏర్పాట్లు పక్కాగా ఉండాలని ఆదేశం
- సర్వేలైన్స్ లోపాలు లేకుండా చూడాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు టౌన్, నవంబర్29 : పోలింగ్ రోజు వెబ్ కాస్టింగ్ సక్రమంగా జరిగేలా బాధ్యులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. గురువారం ఉదయం ప్రారంభం కానున్న పోలింగ్‌కు సంబంధించి తుది పర్యవేక్షణను నేడు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ కేంద్రంను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లు వంద శాతం పక్కాగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల వాహనాల్లోని జీపీఎస్ ట్రాకింగ్, సర్వేలెన్స్, పోలింగ్ సిబ్బంది, వారి విధుల నిర్వహణలో సంబంధిత నోడల్ అధికారులు అలర్ట్‌గా ఉండాలని స్పష్టం చేశారు. పోలింగ్ నివేదికలను సమయానికి పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెబ్ కాస్టింగ్ నోడల్ అధికారి వినోద, ఈడీఎం దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.




మోడల్ పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన హోర్డింగ్

## జిల్లా కేంద్రంలో మోడల్ పోలింగ్ కేంద్రం

భూపాలపల్లి రూరల్, నవంబర్ 29 : భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సింగరేణి మైన్స్ రెస్క్యూ సర్వీస్ కాంటీన్ బూత్‌లో కలెక్టర్, ఎన్నికల అధికారి భవేశ్‌మిశ్రా సూచనల మేరకు ఎన్నికల అధికారులు మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ మోడల్ పోలింగ్ కేంద్రంలో ఓటర్లను ఆకర్షించేలా హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని తెలుపుతూ వాటిపై స్లోగన్స్ రాశారు.